ఆదివారం ఆంధ్రజ్యోతి, 19 ఏప్రిల్, 2009

# బతుకంత చావు

నక్కి నక్కి చూస్తూ వచ్చింది.

మూడడుగులు ముందుకూ, ఆరడుగులు వెనక్కూ. బెదురుచూపులు చూస్తోంది. గేటుకి దగ్గరగా నిలుచుంది.

తల్లి చూసింది. వాలకం గమనించింది.

"ఏందే వచ్చావ్?"

"స్కూల్‌కి పోనే"

"ఏవొచ్చింది?"

చెప్పలేదు. వెంటనే చెప్పే సమాధానం లేదు. చెప్పలేదు.

"చెప్పి చావు. అవతల నన్ను కట్టుకు పోయినంత పనుంది" – విసుగు, వేష్ట, విసురుగా గేటు దగ్గరికి వచ్చింది. చేతిలోని చీపిరిని సిటౌట్‌లో గోడకానించింది.

"బుక్స్‌లు లేందే రావద్దన్నాడే మాస్టారు...."

అర్థమయింది. పాతకథే! అపరాధభావం గుండెలో ప్రవహిస్తోంది. చూపు దిక్కులు వెంబడి పడింది. తిరిగి తిరిగి వచ్చి క్షణంలోనే కూతుర్ని చూసింది.

తలవంచుకుని వుంది. అక్కడ స్కూల్లోనూ తలవంపులే! కళ్లలో నీటి తెర. ఇంకా వర్షించలేదు.

అమ్మ గుండెలోనూ లోలోపల కురుస్తోంది వర్షం. పెద్ద ముంపు. అందులో మునక. అసహాయత.

'ఎట్టా సచ్చేదూ?"– దాన్నే కింకర్తవ్యతా మూఢత అనేది. ఆమెకు అర్థం కాకపోయినా ఏడుపు పేరు అదే! "అమ్మా నిన్ననే కొట్టాడే ఆయన...." ఆగింది. "రాత్రి నీకు చెప్పలేదు కానీ...." సందేహం మాటల్ని చితుకులు చేస్తోంది. భయం, సందేహం కుడికాలి బొటనవ్రేల్తో నేల చారికలు చేసుకుంటోంది.

"బుక్స్ కెప్పుడూ పైసల్లేవు – తిండికైతే వుంటయ్యే – గేదెలా ఎదుగుతున్నావ్" అన్నాడు.

"ఆ చూపులు.... ఛీ..... ఇట్లా...... పిల్లలంతా ఏడిపించారే...."

ఇప్పుడు వర్షమొచ్చేసింది.

తల్లికి కళ్లు మండుతున్నై. కడుపు రగిలిపోతోంది. ముకుపుటాలు అదురుతున్నై. పెదవికి చేటు!

"రంగమ్మా – ఎక్కడే" అమ్మగారి పిలుపు. దాష్టీకం. లేటయితే పూజ....?

"వస్తున్నా.... అమ్మా" కళవళపడింది.

బిడ్డ భుజం మీద చేయివేసి, "నువ్వింటికి పోవే.... రేపు సూద్దాంలే...." అంది. మళ్లీ లాలనగా "కరుణా... జాగ్రత్త" అన్నది.

ఇద్దరూ కదిలారు. ఒకరు లోపలికి, ఒకరు బయటికి. గేటు మీది కాగితంపూలు కదలటం లేదు. గాలి స్తంభించింది.

స్కూలు నడుస్తూనే వుంది.

కొందరికి చదువేమీ నిత్యావసర వస్తువు కాదు!

\+ \+ \+

నక్కినక్కి చూస్తూ వచ్చింది. మూడడుగులు ముందుకూ, ఆరడుగులు వెనక్కూ,

బెదురు చూపులు చూస్తోంది. గేటు దగ్గరే నిలుచుంది.

తల్లి చూసింది. వాలకం గమనించింది.

"ఏందే - ఏం వచ్చేశావేం?"

చెప్పలేదు. వెంటనే చెప్పే సమాధానం రాదు. చెప్పలేదు.

"తొరగా సెప్పేదువు?" .... విసుగు.

"నేనాడ సెయ్యనే"- పెద్ద భయమేమీ లేదు పలుకులో.

"ఏవొచ్చిందే....?"

"ఆ వసంతమ్మయ్యాల పొద్దుటేల ఊరెల్లిందంట. ఆయనొక్కడే ఉండాడు...." తల వొంచుకుంది. నేలచూపు.

తల్లి గుండె అదిరింది. భయం ముసిరింది. తర్వాత అడగలేకపోయింది. అడిగితే? - ఏం చెప్తుందో! ఏం వినాల్సివస్తుందో!

పిల్ల కళ్లల్లోకి సూటిగా చూడలేకపోతోంది.

"సరే. నే ఎల్తాలే. నువ్వెల్లి ఇంటికాడ తమ్ముణ్ణి సూసుకో.... పో...."

మగాడి ఆసరా లేని బతుకు. వాడెప్పుడో పోయాడు. తాగి తాగి వాడే ఖాళీ అయిపోయాడు. ఎవరికి చెప్పుకోగలదు?

బయట బాగానే వెలుగొచ్చింది.

రంగమ్మ దొడ్లో అంట్ల గిన్నెలకేసి కదిలింది.

కరుణ - గోళ్లు కొరుక్కుంటూ ఇంటి దారి చూసుకుంది.

\+ \+ \+

రాత్రి -

పుట్టెడు దుఃఖాన్ని మోస్తోంది.

బిడ్డను కావలించుకుని తల్లి. తల్లిని కావలించుకుని పిల్ల. పొగిలి పొగిలి ఏడుస్తోంది కరుణ. పైకి ఏడవలేకపోతోంది రంగమ్మ. ఎగదట్టుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, ఆపుకోలేక సతమతమవుతోంది తల్లి!

రెండు సంద్రాలూ పొంగుతూనే వున్నై.

చెప్పిందే మళ్లీ చెప్తోంది పిల్ల. బెక్కుతోంది. తల్లి చీర కొంగు తడిసే ఉంది.

"మన కొట్టు పక్క కొట్టుగందే. రోజూ పేపర్లో అయ్యే వార్తలు సదుపుతూ దొంగసూపులూ, నవ్వులూనే. పొటోలు చూయిస్తాడు. టీవీ సూస్తున్నావా? అంటాడు. ఆ అమ్మాయి... ఎవరో స్వప్నంట.... ఆ పిల్లకేం జరిగిందో కతలు సెప్తున్నాడు. నేనంటే యిట్టంగుండు. లేదంటే ఆయమ్మాయి గతే అంటాడే. కూరగాయలకెవురన్నా వస్తే టక్కున ఆపేసి కూకుంటాడు" క్షణాల వ్యవధి.

"అల్లమ్మ – నీలవేణమ్మ – వింటూనే వుంటుంది. దొంగనవ్వులు నవ్వుతుంది."

కాళ్లకింద మన్ను సాయంత్రమే కదిలిపోయింది. ఇప్పుడు గుండెల్లో ఆర్తీ, అసహాయతా, భీతీ..... ఇంకా దగ్గరికి పొదువుకుంది.

గుండె కొట్టుకుంటోంది. కన్నపేగు విలవిల... ఆ రోదనలో అంతఃకరణ కలగలిసిపోతోంది. మాటలు స్రవిస్తున్నై.

"ఎట్టా పెంశేసే బిడ్డా నిన్ను. ఏం చేయించేదే. యాడ దాచగలనే తల్లీ. పెట్టవన్నా కాకపోతివే – ఏ పకిందో దాచేదాన్ని."

దుఃఖానికీ, ఏడుపుకీ లయలూ, శ్రుతులూ ఉండవు.

"ఛీ.... ఛీ... మగపురుగులు!" అనుకున్నై పెదవులూ, నాలుకా!

ఎన్ని రాత్రులైనా అదే దుఃఖం, అదే ఆరాటం. బతుక్కి రక్షణ లేదు, మనసుకి నిబ్బరమూ లేదు!

\+ \+ \+

ఏమిటి – తర్వాతేమిటి? అంటారా?

పిడికిలి లేని చేతులు. కథలేం చెపుతాయి?

'బుద్ధే' చెప్పాలి!!!

('మినీ కథాసౌరభం' సంకలనం)